## నారుమడికి చీరకట్టు..



ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. కొందరు వెదలు జల్లుతుండగా, మరికొందరు నాట్లు వేసేందుకు నారుమడులు సిద్ధం చేశారు. వరినారును పక్షులు, జంతువుల నుంచి రక్షించుకునేందుకు కొందరు రైతులు చీరలనే దడిలా కడుతున్నారు. గుమ్మలక్ష్మీపురం నుంచి గుమ్మవెళ్లే రోడ్డులో ప్రయాణించేవారికి రైతుల నారుమడి రక్షణ చర్యలు కళ్లకుకడుతున్నాయి. -గుమ్మలక్ష్మీపురం

## న్యూస్‌రీల్

### అల్లూరి స్ఫూర్తి యువతకు మార్గదర్శకం

- జేసీ ఎస్ఎస్ శోభిక



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద జ్యోతివెలిగిస్తున్న జేసీ శోభిక

పార్వతీపురంటౌన్: అల్లూరి సీతారామరాజు త్యాగం, పోరాట పటిమ నేటి యువతకు మార్గదర్శకమని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారత స్వాతంత్య్ర పోరాటంలో నిస్వార్థంగా పోరాడిన గొప్ప సమరయోధుడు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు అని కొనియాడారు. ఆయన చూపిన వీరత్వం, త్యాగం అందరికీ ఆదర్శమని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, ఇతర అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


### డోలీలో ఐదు కిలోమీటర్లు..



పూసనంది గ్రామానికి చెందిన చంద్రమ్మను డోలీలో ఆస్పత్రికి తీసుకెళ్తున్న గిరిజనులు

కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం పెదశాఖ పంచాయతీ పరిధిలోని గిరిశిఖర గ్రామం పూసనందికి చెందిన గర్భిణి కొండగొర్రి చంద్రమ్మ శుక్రవారం ఒక్కసారి కళ్లుతిరిగి పడిపోయింది. అపస్మారక స్థితికి చేరడంతో కుటుంబ సభ్యులు ఐదు కిలోమీటర్ల రాళ్లదారిలో డోలీలో పెదశాఖ వరకు తెచ్చి అక్కడ నుంచి ఫీడర్ అంబులెన్స్‌లో కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యంకోసం అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో అద్దెవాహనంలో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాస్పత్రికి తీసుకెళ్లారు. పీహెచ్‌సీలో మెరుగైన వైద్యసేవలందించేందుకు వైద్యులు అందుబాటులో లేరని చంద్రమ్మ బంధువులు ఆరోపించారు. జిల్లాకు చెందిన సంధ్యారాణి గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా పనిచేస్తున్నా విద్య, వైద్య కష్టాలు తీర్చే'దారి' చూపడంలేదని గిరిజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ మల్లయ్య కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీతానగరం ఉన్నత పాఠశాలకు సరఫరా చేసిన బియ్యంలో తేలియాడుతున్న సుంకి పురుగులు



# మెనూ.. పురుగులతోనే తిను!

- మధ్యాహ్న భోజనం బియ్యంలో పురుగులు
- పలు పాఠశాలల్లో ఆ బియ్యంతోనే వంటలు

సాక్షి, పార్వతీపురం మన్యం:

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం బియ్యంలో పురుగులు దర్శనమిస్తున్నాయి. జిల్లాలోని సీతానగరం, వీరఘట్టం మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం పురుగులతో బియ్యం దర్శనమిచ్చాయి. పలుచోట్ల నూక శాతం అధికంగా ఉంటోంది. దీంతో భోజన నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

**పేరుకే సన్నబియ్యం..**


పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన బలవర్ధక ఆహారం అందించేందుకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. పాఠశాలలు గత నెల 12వ తేదీన పునఃప్రారంభం కాగా.. అదే రోజున జిల్లాలోని 1,504 పాఠశాలలకు 5,184 (25 కిలోల బస్తాలు), 150 వసతి గృహాలకు 13,456 బస్తాల బియ్యం సరఫరా చేశారు. బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు అని క్యూఆర్ కోడ్ కూడా ఏర్పాటు చేశారు. ఇంత వరకూ బాగానే ఉన్నా బియ్యం నాణ్యతే బాగోలేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యాశాఖ, పౌరసరఫరాల సంస్థ పర్యవేక్షణ లేకపోవడంతో పురుగులు, ముక్కుపట్టిన బియ్యాన్నే పాఠశాలలకు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### పురుగుల అన్నం తినలేం..



వీరఘట్టంలోని ఓ పాఠశాలకు వచ్చిన బియ్యంలో ఉన్న పురుగులు

వీరఘట్టం: మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం మధ్యాహ్న భోజనంలో పురుగులతో కూడిన అన్నం వడ్డించారు. చాలామంది విద్యార్థులు భోజనం చేయకుండా ఇంటికి వెళ్లిపోయారు. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో ఆందోళన వ్యక్తంచేశారు. పాఠశాలలకు వెళ్లి పురుగులు పట్టిన బియ్యంను పరిశీలించి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. పిల్లలకు పురుగుల పట్టిన బియ్యం సరఫరా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ ఎ.ఎస్. కామేశ్వరరావును కోరారు.



బియ్యంలో నులిపురుగులు

### బడి పిల్లలకు పురుగుల బియ్యమా?

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన సన్నబియ్యం పేరుతో పురుగులు పట్టిన బియ్యం సరఫరా చేస్తోందని, విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడుతోందని సీపీఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు మండిపడ్డారు. సీతానగరం ఉన్నత పాఠశాలకు సరఫరా చేసిన పురుగుల బియ్యంను చూసి అవాక్కయ్యారు. బియ్యం సరఫరా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం మండల నాయకులు



వీరఘట్టం మండలంలోని ఓ పాఠశాలలో బియ్యంను చేటతో చెరుగుతుండగా కనిపించిన పురుగులు

# ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- పీహెచ్‌సీ, సీహెచ్‌సీ భవన నిర్మాణాల్లో జాప్యంతో తప్పని అవస్థలు
- ఎరువులు, విత్తనాల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి
- జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చర్చించిన జెడ్పీ చైర్మన్, సభ్యులు



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పాల్గొన్న మంత్రులు, కలెక్టర్లు

విజయనగరం:

సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు.. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ భవన నిర్మాణాల పూర్తి.. ఎరువులు, విత్తనాల ధరల నియంత్రణ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుదల.. తదితర అంశాలపై విజయనగరం జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు చర్చించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, శ్యాంప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు. తొలుత అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో వైద్యం, వ్యవసాయం, విద్య రంగాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

**ఒకే మంచంపై ముగ్గురు రోగులకు వైద్యం**

ఏజెన్సీలోని ఆస్పత్రుల్లో ఒకే మంచంపై ముగ్గురు రోగులకు వైద్యం చేస్తున్నారని, కురుపాం సీహెచ్‌సీకి రోగుల తాకిడి పెరుగుతున్నా అవసరమైన భవన నిర్మాణ పనులు పూర్తి చేయడంలో తాత్సారం చేస్తున్నారంటూ కురుపాం మండల జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సుజాత, ఎంపీపీ శెట్టి పద్మావతిలు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, కొత్తవలసలో ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో స్థానికంగా ఉన్న ఎస్‌జీఓ హోంలో రోగులకు సేవలందిస్తున్నారని, ఒకే గదిలో రోగులకు తనిఖీలు, ఆపరేషన్లు చేస్తున్నారని జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి సభలో ప్రస్తావించారు. దీనిపై స్పందించిన అధికారులు త్వరలో భవన నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందుస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో స్కానింగ్ యంత్రాలు ఎందుకు పని చేయడం లేదని అధికారులను ప్రశ్నించారు. సర్వజన ఆస్పత్రి నుంచి విశాఖలో కేజీహెచ్‌కు రిఫరల్ కేసుల సంఖ్య పెరుగుతోందని, ప్రజాప్రతినిధులు ఫోన్ చేసి చెబితే మరింత వేగంగా ఇతర ఆస్పత్రులకు పంపించడం వెనుక అంతర్యమేమటన్నారు. స్పందించిన సూపరిండెంట్ కార్డియాలజీ, గ్యాస్ట్రో తదితర అత్యవసర కేసులను తప్పనిసరి పరిస్థితుల్లో రిఫరల్ చేయిస్తున్నామని, ఆస్పత్రుల్లో అన్ని యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనబంధంగా సర్వజన ఆస్పత్రిని మార్చు చేసే ప్రక్రియపై కళాశాల ప్రిన్సిపాల్‌తో చర్చించారు. వచ్చే ఏడాది నాటికి పనులు పూర్తి చేయాలని సూచించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మెడికల్ కళాశాల వద్దకు ఆస్పత్రిని తరలిస్తే ప్రజలకు దూరం అవుతుందని, అటువైపు వెళ్లేందుకు రవాణా సౌకర్యం కూడా లేదని, కొన్ని విభాగాలను బోధనాస్పత్రి వద్ద ఏర్పాటు చేసి, పాత ఆస్పత్రినే అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

- అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి అందించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులను కోరారు. మ్యుటేషన్ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. కొందరు రైతులు ఎరువులు, విత్తనాలు ప్రైవేటు డీలర్ల వద్ద అధిక మొత్తం చెల్లించి కొనుగోలు చేస్తున్నారని, అధిక ధరలకు విక్రయించే వారిపై విజిలెన్స్ అధికారులతో తనిఖీలు చేయించి రైతులకు న్యాయం చేయాలన్నారు.

**విద్యార్థుల తగ్గుదల ఆందోళన కలిగించే విషయం**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గడం ఆందోళన కలిగించే విషయమని, సంఖ్య తగ్గకుండా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని జెడ్పీ చైర్మన్ కోరారు. ఇటీవల మెరకముడిదాం మండలంలో తనిఖీ చేసినప్పుడు గత ఏడాది కన్నా 1100 మంది తగ్గారని తెలిసిందని, ఒకే మండలంలో ఇంత మంది తగ్గితే జిల్లా అంతటా ఈ సంఖ్య ఎక్కువే ఉంటుందన్నారు. తల్లికి వందనం పథకం కింద ఒక్కోవిద్యార్థి నుంచి కట్ చేసిన రూ.2వేలు పాఠశాలల ఖాతాలకు ఎప్పుడు వేస్తారని ప్రశ్నించారు. విద్యార్థుల నమోదు తగ్గుదలపై శాస్త్రీయంగా విశ్లేషణ జరగాలని, దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలని డీఈఓకు మంత్రి కొండపల్లి సూచించారు. తక్షణమే సర్వేచేసి కారణాలు తెలుసుకోవాలన్నారు. ఈ నెల 10న మెగా టీచర్ పేరెంట్స్ సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ లోపల అడ్మిషన్లు పూర్తిచేస్తామని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు.

### గోరపాడులో ఏనుగుల ఘీంకారం

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని గోరపాడు సమీపంలో నాలుగు ఏనుగుల గుంపు తిష్ట వేయడంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. జీడి, మామిడి తోటల్లో కొమ్మలను విరిచేస్తుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఏక్షణాన గ్రామాల్లోకి వచ్చేస్తాయేమోనని ఆందోళన చెందుతున్నామన్నారు. ఏనుగుల గమనాన్ని ఎఫ్‌బీఓ కె.దాలినాయుడుతో పాటు ట్రాకర్లు పరిశీలించి, గిరిజనులకు తగు సూచనలిస్తున్నారు.



గోరపాడు సమీపంలో ఉన్న ఏనుగులు

# నాణ్యత డొల్ల

- 2.6 కోట్ల ఖర్చుతో వేసిన రోడ్డు
- ప్రారంభానికి ముందే బీటలు

జియ్యమ్మ వలస రూరల్: మండలంలోని పెదమేరంగి కూడలి నుంచి వెంకటరాజపురం మీదుగా బాసంగి గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించిందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోటజీవన్న తెలిపారు. 2.60 కోట్ల ప్రజాధనంతో చేపట్టిన బీటీ రోడ్డు ప్రారంభానికి ముందే బీటలువారిందన్నారు. మట్టిపై తేలికపాటి తారు మిక్సింగ్ వేయడం వల్లే రోడ్డు మూన్నాళ్ల ముచ్చటగా మారిందని, నాసిరకం పనులతో ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన వెంట సీపీఐ కార్యవర్గ సభ్యుడు గరుగుబిల్లి సూరయ్య ఉన్నారు.



నాసిరకం రోడ్డును చూపిస్తున్న సీపీఐ ప్రతినిధులు

## క్లుప్తంగా

### కొనసాగుతున్న డ్రైవర్ల నిరసన



నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు

పార్వతీపురం: అద్దె బస్సుల డ్రైవర్ల నిరసన నాలుగవ రోజు కొనసాగుతోంది. శుక్రవారం పార్వతీపురం ఆర్టీసీ డిపో గేటు వద్ద నల్ల బ్యాడ్జీలతో డ్రైవర్లు నిరసనలో పాల్గొని తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డివేణు, జి.వెంకటరమణ, బి.సూరిబాబు తదితరులు మాట్లాడుతూ అద్దె బస్సుల యజమానులు, ఆర్టీసీ అధికారులు సానుకూలంగా స్పందించి అద్దె బస్సు డ్రైవర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. అద్దెబస్సు యజమానులు కవ్వింపు చర్యలకు పాల్పడడం, భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అద్దె బస్సు డ్రైవర్లు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు కేవీ చారి, పీడీ ప్రసాద్, ఎ.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా సహస్ర దీపాలంకరణ



దీపాల కాంతుల్లో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం కనులపండువగా జరిపించారు. వెండి మంటపంలో ఉన్న శ్రీ సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మంటపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో వేంచేపు చేశారు. అనంతరం దీపాలను వెలిగించి, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర దీపాల శోభలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

### శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి పోలీస్ "వెల్ఫేర్ డే"

- ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి



పోలీసు సిబ్బంది తెలియజేస్తున్న సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: శాఖాపరమైన సేవల్లో నిత్యం నిమగ్నమై ఉండే పోలీసు సిబ్బంది సమస్యలతోపాటు శాఖాపరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి నిర్వహించారు. పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న సిబ్బంది, అధికారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, అలాగే సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ తమ సమస్యలను తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని పలువురు పోలీసుశాఖ సిబ్బంది పాల్గొని వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీకి స్వయంగా తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తనకు చేరిన సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అవకాశం ఉన్నంత మేరకు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

### ఒకే మొక్కకు 5 బ్రహ్మకమలాలు



పూసిన బ్రహ్మ కమలాలు

సీతానగరం: మండలకేంద్రానికి చెందిన ఆర్వీ పార్థసారథి నివాసంలో ఒకే మొక్కకు 5 బ్రహ్మకమలాలు పూయడంతో రోడ్డుపై వెళ్తున్న వారంతా వాటిని చూస్తూ ఆస్వాదిస్తున్నారు. మొక్కలప్రియుడైన ఆర్వీ పార్థసారథి నివాసంలో వివిధ రకాల పూల మొక్కలు పెంచుతున్నారు. ఈ ప్రాంతంలో బహ్మకమలం మొక్కలు పుట్టడమే అరుదు. ఒకవేళ పుట్టినా ఒకటి లేదా రెండు పువ్వులు పూయడం పరిపాటి. పార్థసారథి నివాసంలో అరుదైన బ్రహ్మకమలాలు రావడంతో చూపరులంతా ఆశ్చర్యచకితులవుతున్నారు.

### చికెన్

| బ్రాయిలర్ | | |
|---|---|---|
| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
| ₹95 | ₹160 | ₹170 |

# పడగ విప్పుతున్న మహమ్మారి

- జిల్లాలో 1264 మలేరియా పాజిటివ్ కేసులు
- సింగిల్ డాక్టర్లతో నడుస్తున్న పీహెచ్‌సీలు
- 14 వైద్యాధికారుల పోస్టులు ఖాళీ
- గ్రామాల్లో వైద్యశిబిరాలు అంతంతమాత్రమే
- దోమల తెరల పంపిణీ నిల్



జ్వరంతో బాధపడుతూ పాలకొండ ఏరియా ఆస్పత్రికి వచ్చిన ఇందిరానగర్ కాలనీ వసతిగృహ విద్యార్థులు



సీతంపేట ఏరియా ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లు

సీతంపేట/పాలకొండ రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలో మలేరియా మహమ్మారి పడగ విప్పుతోంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా, అలాగే ఆశ్రమ, వసతిగృహాల్లో జ్వరాల బాధితులతో ఏజెన్సీలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వైరల్ జ్వరాలతో పాటు మలేరియా, టైఫాయిడ్ ఎక్కువవుతున్నాయి. ఈ సీజన్‌లో జనవరి నుంచి ఇప్పటివరకు వరకు 1264 మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని అధికారిక గణంకాలు చెబుతుండగా ఆ సంఖ్య ఇంకా ఎక్కువ ఉండవచ్చని అనధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 42, ఆరోగ్య ఉపకేంద్రాలు 200 వరకు ఉన్నాయి. ముఖ్యంగా పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో వైద్యులు ఇద్దరు చొప్పున ఉండాలి. ఒకరు మెడికల్ క్యాంప్ వెళ్లినా, మరొకరు పీహెచ్‌సీలో ఓపీ చూడాలి. 14 మంది వరకు వైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని పీహెచ్‌సీల్లో వైద్యసేవలు నామమాత్రంగానే అందుతున్నాయనే ఆరోపణలున్నాయి. రోజుకు ఓపీ 50 నుంచి 100 మధ్య పీహెచ్‌సీల్లో ఉండగా, ఏరియా ఆస్పత్రుల్లో 200 నుంచి 300ల మధ్య ఉంటోంది. మారుమూల గ్రామాల్లో జ్వరపీడితుల సంఖ్య అధికంగా ఉంది. పీహెచ్‌సీల నుంచి ఏరియా ఆస్పత్రులకు రిఫరల్ కేసులు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి.

### 550 హైరిస్క్ గ్రామాలు..

జిల్లాలో 1250 పైన గిరిజన గ్రామాలున్నాయి. వాటిలో సుమారు 550 గ్రామాలను మలేరియా హైరిస్క్ గ్రామాలుగా ప్రభుత్వం గుర్తించింది. దీనిలో భాగంగా ఈ గ్రామాల్లో మలేరియా కారక దోమల నివారణకు ఐఆర్ఎస్ 5శాతం ఏసీఎం ద్రావణాన్ని దశల వారీగా పిచికారీ చేస్తున్నారు. మలేరియా నివారణ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ జ్వరాల నివారణ చర్యలు చేపట్టినప్పటికీ మలేరియా మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. జనవరి నుంచి ఇప్పటివరకు 1,31,902 మంది రక్తపూతలు సేకరించగా వాటిలో 1264 మలేరియా పాజిటివ్ కేసులు జూన్ నెలాఖరు వరకు నమోదయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రులు, చిన్నచిన్న క్లినిక్‌లు, గ్రామాల్లో సంచి వైద్యులు వంటి వారి వద్దకు వచ్చే మలేరియా పాజిటివ్ కేసులు ఇంతకు రెట్టింపు సంఖ్యలో ఉంటాయి.

### కాలం చెల్లిన దోమతెరలు..

దోమతెరల కాలపరిమితి ఐదేళ్లు. అయితే దోమతెరలను ఉతకడం వంటి పనులు చేస్తే మూడేళ్లకే పాడవుతాయని సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో దోమతెరలకు కాలం చెల్లాయి. మరికొన్ని చినిగిపోయాయి. ఇప్పటికే పాడైన దోమతెరలను చాలా గ్రామాల్లో చేపలు పట్టడానికి, మొక్కలకు కంచె వేయడానికి వినియోగిస్తున్నారు.

### 20 వేల మంది అభ్యాసం

ఐటీడీఏ పరిధిలో 47ఆశ్రమపాఠశాలలు, 13 రెసిడెన్షియల్ పాఠశాలలు, మూడు గురుకుల కళాశాలలు, 13 పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలున్నాయి. వాటిలో దాదాపు 20 వేల మంది గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారికి కూడా దోమతెరలు పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు వారికి కూడా పంపిణీ జరగలేదు. ఈ సీజన్‌లో దోమల ఉత్పత్తి ఎక్కువగా ఉండడంతో దోమతెరల వినియోగం తప్పనిసరి. ఆడ ఎనాఫిలిస్ దోమ కారణంగా ఫాల్సీపారం మలేరియా ప్రబలుతోంది. ఇది సెరిబ్రల్ మలేరియాకు దారితీసి గిరిజనుల ప్రాణాల మీదికి వస్తుంది. అయితే దోమతెరలను విస్తృతంగా వాడించడం ద్వారా కొంతవరకు మలేరియాను నియంత్రించవచ్చని వైద్యబృందాలే తెలియ జేస్తున్నప్పటికీ వాటి పంపిణీని మాత్రం ప్రభుత్వ పట్టించుకోవడం లేదు.

### జ్వరాల నివారణకు చర్యలు



జ్వరాల నివారణకు విస్తృతంగా చర్యలు చేపట్టాం. 4 లక్షల 50 వేల దోమతెరల కోసం ఇండెంట్ పంపించాం. అవి వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం. పీహెచ్‌సీల్లో మందుల కొరత లేదు. వైద్యపోస్టుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం.

డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌వో

# చందాలతో పాఠశాల షెడ్ నిర్మాణం



పాఠశాల రేకుల షెడ్డును ఓపెన్ చేస్తున్న సర్పంచ్ ఆదయ్య, స్కూల్ కమిటీ సభ్యులు, పక్కనే ఉన్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- ప్రారంభించిన మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: పిల్లల బంగారు భవిష్యత్‌కు విద్య ఎంతో మూలమని గుర్తించి చందాలతో పాఠశాలకు రేకుల షెడ్డు నిర్మించిన విద్యార్థు ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, దాతలకు పాదాభివందనాలు చేస్తున్నానని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు మండలంలో తోణాం పంచాయతీ మెట్టవలస గ్రామంలో చందాలతో నిర్మించిన పాఠశాల రేకుల షెడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మువ్వల ఆదయ్య మాట్లాడుతూ ,ఈ పాఠశాల షెడ్ ప్రారంభోత్సవానికి రావాలని రాజన్నదొరను అడగ్గా, ప్రోటోకాల్ ఉల్లంఘన అవుతుందని తాను రానని రాజన్నదొర తిరస్కరించగా, ఈ పాఠశాల ప్రభుత్వ నిధులతో నిర్మించలేదని మా గిరిజనులు, దాతలు చందాలతో నిర్మించుకున్నదని చెబితే రాజన్నదొర వచ్చారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**తప్పుగా మాట్లాడితే మూల్యం తప్పదు**

సాలూరు: తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు ఇటీవల తమను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని, సదరు నేతలు తగు మూల్యం చెల్లించుకోకతప్పదని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని తోణాం పంచాయతీ మెట్టవలసలో విలేకరులతో మాట్లాడుతూ, తమను రెచ్చగొట్టేలా టీడీపీ నేతలు మాట్లాడుతున్నా ఇంత వరకు ఎంతో సంయమనంతో ఆగామని, ఇకఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. విజ్ఞత కోల్పోయి సంస్కారం లేకుండా మాట్లాడిన వారిపై కేసులు పెడతామన్నారు. రాజకీయాల్లో హుందాగా ఉండాలన్నారు.తాను ఏనాడూ తాను చంద్రబాబునాయుడు, లోకేష్, పవన్‌కల్యాణ్‌లతో పాటు స్థానిక మంత్రి సంధ్యారాణిని వ్యక్తిగతంగా దూషించలేదని పేర్కొన్నారు. పార్టీలు, వ్యవస్థలపై విమర్శించడం వేరని, వ్యక్తిగత విమర్శలు చేయడం వేరనే విషయాన్ని టీడీపీ నేతలు గ్రహించాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్, పార్టీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు మువ్వల ఆదయ్య, పీడిక సుదర్శనదొర, నూకయ్య, జన్ని సీతారాం, సుబ్బారావు, రఘుపాత్రుని సాంబమూర్తి, నెమలిపిట్ట కల్యాణ్, పెద్దింటిమాధవరావు, కొండగొర్రి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కొలకట్టు వీధిలో చోరీ

సాలూరు: పట్టణంలోని కొలకట్టు వీధిలో గల ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు ఫిర్యాదు అందిందని సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, కొలకట్టు వీధిలో నివాసముంటున్న కోటదేవి తమ కుటుంబంతో కలిసి ఈ నెల 2న తీర్థయాత్రల నిమిత్తం ఒడిశాలోని గుప్తేశ్వరం వెళ్లారన్నారు. శుక్రవారం వారు తిరిగి ఇంటికి చేరుకుని చూడగా ఇంటి తాళాలు, బీరువా పగులగొట్టి ఉన్నట్లు గుర్తించి బీరువాలో చూడగా 15 తులాల బంగారం, వెండి సామగ్రి పోయాయని ఫిర్యాదు చేశారన్నారు.

### ఎరువు కొరత తీర్చండి

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

పాచిపెంట: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరిపడా ఎరువులు లభించడం లేదని ప్రజాప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం పాచిపెంట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బడ్నాన ప్రమీల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు ఎరువుల కొరతపై ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న ఎరువులు కొంతమందికే అందుతున్నాయని వాపోయారు. కేరంగి రైతుభరోసా కేంద్రానికి ఎరువులు పంపించినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ఏ ఒక్క గిరిజన రైతుకు అందలేదని సర్పంచ్ సోముల లచ్చయ్య వ్యవసాయాధికారి తిరుపతిరావును నిలదీశారు. రాయిగుడ్డివలస రైతు భరోసా కేంద్రానికి ఇంతవరకు ఎరువులు సరఫరా చేయలేదని సర్పంచ్ చింత సీతయ్య అధికారులను ప్రశ్నించారు. ప్రైవేట్ దుకాణాల్లో విక్రయిస్తున్న ఎరువులకు నిర్వాహకులు ఎరువుతోపాటు వారి వద్ద ఉన్న రకరకాల ఎరువులను అంటగడుతున్నారని వైస్ ఎంపీపీ కొల్లి రవీంద్రనాథ్ మండిపడ్డారు. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని, సమయం దాటిన తరువాత ఎరువులను సరఫరా చేసినా ఉపయోగం ఉండదన్నారు. ఈ సందర్భంగా సాలూరు ఏఎంసీ చైర్మన్ ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ ఎరువుల కొరత లేకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని, రెండు, మూడురోజుల్లో సమస్య పరిష్కారమవుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ పాత్రో, వైస్ ఎంపీపీ ఎం.నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ధర్నా, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి



ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించేందుకు పోలీసుశాఖ నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, ఇతర నిరసన కార్యక్రమాలను నిర్వహించేందుకు తప్పనిసరిగా పోలీసుశాఖ నుంచి ముందస్తుగా అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. పోలీసు శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేనిదే ఎలాంటి నిరసనలైనా చేపట్టడం చట్టవిరుద్ధమన్నారు. ఇందుకోసం ముందుగా సంబంధిత డీఎస్పీ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలని సూచించారు. పర్మిషన్ లేకుండా ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు, సమావేశాలు నిర్వహించడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. శాంతియుతంగా వ్యవహరించాలని, విజ్ఞతతో వ్యవహరించి ముందస్తు అనుమతులతోనే ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. అలా కాకుండా, చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తూ ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, నిరసన కార్యక్రమాలు చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు.

# పోలీసు వెల్ఫేర్ డే నిర్వహణ

- సిబ్బంది సమస్యలు తెలుసుకున్న ఎస్పీ



తన చాంబర్‌లో సిబ్బంది సమస్యలను ఆలకిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: పోలీస్ శాఖ ప్రతి శుక్రవారాన్ని సిబ్బంది సంక్షేమానికి కేటాయించింది. ఈ మేరకు వారంలో ఒక్క రోజు 'పోలీసు వెల్ఫేర్ డే' నిర్వహిస్తోంది. అందులో భాగంగానే ఎస్పీ వకుల్ జిందల్ తన చాంబర్‌లో శుక్రవారం వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలపై విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది పనితనం, విధుల్లో ఎదుర్కొంటున్న, ఎదురవుతున్న సమస్యలపై ప్రత్యక్షంగా తన వద్దకు పిలిచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తానని చెప్పారు. వెల్ఫేర్ డే లో సిబ్బంది నుంచి అందుకున్న విజ్ఞాపనలను పరిశీలించారు.అనంతరం, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని సిబ్బందికి హామీ ఇచ్చారు. సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను ఎస్పీ స్వయంగా నోట్ చేసుకున్నారు.

### మ్యుటేషన్లు త్వరగా పరిష్కరించాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ

పాచిపెంట: గ్రామసభల్లో వచ్చిన మ్యుటేషన్లను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. ఈ మేరకు పాచిపెంట మండలంలోని మోసూరు గ్రామంలో రెవెన్యూ సమస్యలపై శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు పీఓ హాజరై ఫిర్యాదులను స్వీకరించారు. భూ సవరణలకు సంబంధించి మ్యుటేషన్ కోసం పెట్టుకున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో ప్రైవేట్ భూములతో పాటు గ్రామ సరిహద్దులు, నీటివనరులున్న భూములు, పోరంబోకు భూములకు కొలతలు వేసి కచ్చితమైన సరిహద్దులను ఏర్పాటు చేయాలని, తద్వారా రైతులకు, భూ యజమానులకు శాశ్వత మేలు జరుగుతుందన్నారు. రీ-సర్వేలో తప్పులు దొర్లకుండా పక్కాగా నిర్వహించాలని సూచించారు. మృతి చెందిన రైతుల మ్యూటేషన్లపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.రవి, ఆర్ఐ రమణారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుపై ఫిర్యాదు

- ఎస్సీలను కుక్కపిల్లతో పోల్చిన సీఎం



ఫిర్యాదుపత్రంతో పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు

పార్వతీపురం రూరల్: దళితులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదేపదే అవమానకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని, మరణించిన దళితుడు సింగయ్యను కుక్కపిల్లతో పోల్చడం మొత్తం సమాజాన్నే కించపర్చేలా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు మండిపడ్డారు. ఈ మేరకు ఆయన స్థానిక నాయకులతో కలిసి చంద్రబాబుపై పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన దళితుడిని సైతం కుక్కపిల్లతో పోల్చి అవహేళన చేయడం దారుణమన్నారు. చంద్రబాబుకు దళితులంటే ఆదినుంచి చిన్నచూపేనని, మృతి చెందిన వ్యక్తికి కూడా కనీస స్థాయిలో గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుడు కాబట్టే కుక్కతో పోల్చుతూ హీనంగా మాట్లాడతారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు తన ప్రచారం కోసం అనేక మందిని పొట్టన పెట్టుకున్న పుష్కరాల ఘటనను గుర్తుచేశారు. ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు ఏనాడూ తమ పార్టీ నాయకులు బలహీన వర్గాలపై చేయలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ ఆర్టీఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, 13వ వార్డు సీనియర్ నాయకుడు నేతాజీ, రాజేష్, చింతగడ లక్ష్మి, నారాయణ, రాజా, రాజీవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎవరేమనుకున్నా.. అదే తీరు!

- 'పుర' పాలకవర్గంపై కొనసాగుతున్న వివక్ష
- చైర్‌పర్సన్‌కు తెలియకుండానే అభివృద్ధి పనులకు భూమిపూజ



మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న చైర్‌పర్సన్, సభ్యులు

సాక్షి, పార్వతీపురం మన్యం:

పార్వతీపురం పురపాలక సంఘంలో పాలకవర్గంపై వివక్ష కొనసాగుతోంది. ఎవరేమనుకున్నా.. ఎన్ని విమర్శలు వస్తున్నా.. కూటమి నేతలు వారి మాటే శాసనంగా భావిస్తున్నారు. పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలను కనీసం పాలకవర్గాన్ని పిలవకుండానే నిర్వహిస్తుండటం గమనార్హం. ఒక వార్డు కౌన్సిలర్ ఇంటి ఎదురుగా జరుగుతున్న పనులు.. సదరు కౌన్సిలర్‌కు కూడా తెలియకపోవడం విశేషం. పార్వతీపురం పట్టణంలోని ఎస్ఎన్ఎం కాలనీ, కుసుంగుడ్డి వీధి తదితర ప్రాంతాల్లో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న రహదారులు, కాలువల నిర్మాణానికి గురువారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర.. టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాలకు మున్సిపల్ అధికారులు పాలకవర్గాన్ని ఆహ్వానించకపోవడం గమనార్హం.

**తనకు తెలియకుండానే పనులు: చైర్‌పర్సన్**

మున్సిపల్ పాలకవర్గానికి తెలియకుండానే వార్డుల్లో అభివృద్ధి పనులు చేయడమేమిటని చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు కనీస ప్రోటోకాల్ పాటించడం లేదని వాపోయారు. ఇదే విషయమై గతంలోనూ అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని తెలిపారు. దీనిపై కమిషనర్ వెంకటేశ్వర్లును శుక్రవారం నిలదీశారు. కనీసం ఆ వార్డు కౌన్సిలర్‌కు తెలియకుండా.. ఆయన ఇంటి ఎదురుగానే పనులు చేపట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తామూ వార్డుల అభివృద్ధినే కోరుకుంటున్నామని, గౌరవప్రదంగా సమాచారం అందిస్తే తప్పేమిటని నిలదీశారు. పనులు జరిగినప్పుడు తాను లేనని.. ఆ విషయాలేవీ తనకు తెలియదని కమిషనర్ వెంకటేశ్వర్లు సమాధానమివ్వడం గమనార్హం.

# తేలని ఈఈల పంచాయితీ!





పి.రమాదేవి, ఈఈ, కె.వి.ఎస్.ఎస్ కుమార్, ఈఈ

సీతంపేట: ఐటీడీఏలో అన్ని శాఖల్లో కీలకమైనది ఇంజినీరింగ్ విభాగం. రోడ్లు, భవన నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పనలో ఆ శాఖ అధికారులు పాత్ర కీలకం. కూటమి ప్రభుత్వ తప్పిదాలతో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ శాఖలో ఈఈ పోస్టు విషయంలో గందరగోళం నెలకొంది. మునుపెన్నడూ లేని విధంగా ఒక ఈఈ పోస్టుకోసం ఇద్దరు ఈఈల మధ్య కుర్చీలాట సాగుతోంది. ఇక్కడ ఎన్నిమిది నెలలుగా ఈఈగా పనిచేస్తున్న రమాదేవిని గత నెల 9న నెల్లూరుకు బదిలీ చేశారు. ఆ స్థానంలో కేవీఎస్ఎస్ కుమార్‌ను నియమించారు. ఆయన గత నెల 11న బాధ్యతలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా తనను బదిలీ చేశారంటూ రమాదేవి కోర్టును ఆశ్రయించారు. ఆమె బదిలీ ఉత్తర్వులను కోర్టు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఆ మేరకు తను తిరిగి ఈఈగా గత నెల 18న సీట్లో కూర్చున్నారు. ఈ పంచాయితీ గత నెల 26న ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి వద్దకు వెళ్లింది. రమాదేవిని ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీని కలవాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు కుమార్ ఈఈగా కొనసాగుతారని అప్పట్లో తెలియజేశారు. దీంతో పరిపాలనా విధులన్నీ ఈఈ కుమార్ నిర్వహిస్తున్నారు.

**మళ్లీ మొదటి కొచ్చిన కథ..**

తానే ఈఈని అంటూ మళ్లీ రమాదేవి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కుర్చీలో యథావిధిగా వారం రోజుల తర్వాత వచ్చి శుక్రవారం కూర్చున్నారు. గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిశానని, కోర్టు ఉత్వర్వుల మేరకు ఈఈగా బాధ్యతలు కొనసాగిస్తానని తెలిపారు. ఈ విషయమై ఈఈ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం తనను ఇక్కడకు బదిలీ చేయడంతో విధులు నిర్వహిస్తున్నాని తెలిపారు. డీడీఓ అధికారాలు కూడా ఉండడంతో ప్రశాంతంగా ఉద్యోగం చేస్తున్నానన్నారు. ఫైనల్ ఆర్డర్ ప్రభుత్వం నుంచి ఎలా వస్తే అలా చేస్తామన్నారు. కాగా కిందిస్థాయిలో ఉద్యోగులు, జేఈ, ఏఈలు మాత్రం ఎవరిని కలవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.